# నమస్తే తెలంగాణ

## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




జనగామలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, చిత్రంలో ఎమ్మెల్యే పల్లా

# జనగామను జీవితాంతం గుర్తుంచుకుంటా..

- ఇక్కడి నేలపై అడుగుపెట్టడం అదృష్టంగా భావిస్తున్నా
- ప్రజలు, అధికారులు సమష్టిగా పనిచేయాలి..
- గొప్ప విజయాలను అందుకోవాలి..
- జిల్లా పర్యటనలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు పల్లా, కడియం, వరంగల్ ఎంపీ కావ్య, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- కలెక్టరేట్‌లో ప్రముఖులతో ముఖాముఖి
- ఓబుల్ కేశ్వాపూర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం సందర్శన

జనగామ, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : ఎందరో కళాకారులు, కవులు, రచయితలు, ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులకు జన్మనిచ్చిన జనగామ నేలపై అడుగుపెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని, ఈ సందర్భాన్ని జీవితకాలం గుర్తుంచుకుంటానని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయన జనగామ జిల్లాకు వచ్చారు. ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై వివిధ శాఖల అధికారులు, జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, కళాకారులు, రాష్ట్ర, జాతీయ పురస్కార గ్రహీతలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ప్రముఖ కవి, గాయకుడు అందెశ్రీ తన పాటతో అలరించారు. అనంతరం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, చారిత్రక ఆలయాలు, ప్రసిద్ధిగాంచిన ప్రాంతాల విశిష్టతను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పేరిణి, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను తిలకించారు. గవర్నర్ మాట్లాడుతూ ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి గొప్ప విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. చేనేత ఉత్పత్తి కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి తన పరిపూర్ణ సామర్థ్యాన్ని చేరుకోవడానికి చేసిన పోరాటంగా ఆయన అభివర్ణించారు. సమాజ పరివర్తన, విధి విధాన రూపకర్తలు ఒకే వేదికపై ఇరువైపులా ఆసీనులై ఉండటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌ను అభినందిస్తూ, ఇటువంటి వసతుల కల్పన ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. జిల్లాలో గడిపిన ఈ కొద్ది సమయం తనకెంతో మధురానుభూతిని అందించిందని తెలిపారు. ఇక్కడి ప్రజల ప్రేమ, ఆప్యాయతలు, అధికారుల ఆతిథ్యాన్ని అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతం అనేక ఉద్యమాలకు కేంద్ర బిందువని, ఇక్కడ మొదలైన ఆందోళనలు, ఉద్యమాలు తర్వాతి కాలంలో వివిధ ప్రాంతాలకు వ్యాప్తి చెంది రాష్ట్రాన్ని ప్రభావితం చేశాయన్నారు. చిన్న జిల్లా అయినప్పటికీ యువశక్తిని కలిగి ఉందన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ఒకప్పుడు నిరుపేద జిల్లాగా ఉన్న జనగామ ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా పేరొందిందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇతర ప్రాంతాలతో పోలిస్తే జనగామ జిల్లా అనేక ప్రత్యేకతలు కలిగి ఉందన్నారు. నిజాం, అతని అనుచరులకు వ్యతిరేకంగా అనేక విప్లవాత్మక ఉద్యమాలకు, ఆందోళనలకు జన్మస్థలమని, అదే సమయంలో అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు.

**ఓబుల్ కేశ్వాపూర్ టూరిస్ట్ హబ్ కావాలి**

జనగామ రూరల్ : ఓబుల్ కేశ్వాపూర్ ప్రాంతాన్ని టూరిస్ట్ హబ్‌గా తయారు చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తాను తొలిసారి గ్రామాల్లో పర్యటించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ గ్రామానికి వచ్చిన గవర్నర్‌కు మహిళలు కోలాటంతో స్వాగతం పలికారు. గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడే మొక్కలు నాటారు. ఆలయం ఆడిటోరియంలో కవులు, కళాకారులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తన కార్యాలయ కార్యదర్శి గ్రామంలోని ఆలయం చిన్నదిగా ఉంటుందనుకున్నానని, కానీ చాలా పెద్దదిగా ఉందన్నారు. ఆలయం బాగుందని కితాబిచ్చారు. బుర్ర వెంకటేశం మాట్లాడుతూ గవర్నర్ మన గ్రామానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. గవర్నర్ పర్యటన విజయవంతానికి పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్ కుమార్, గవర్నర్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




ఓబుల్ కేశ్వాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో మొక్క నాటుతున్న గవర్నర్

# మనీ లెండింగ్ లైసెన్స్ కోసం ఫోర్జరీ

- తహసీల్దార్ సంతకంతోపాటు స్టాంప్‌లూ నకిలీవే
- రెన్యువల్ కోసం వచ్చి దొరికిపోయిన వ్యాపారి

పోచమ్మమైదాన్/మట్టెవాడ, ఆగస్టు 28: మనీ లెండింగ్ లైసెన్స్ కోసం తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసిన ఘనుడు, చివరికి రెన్యువల్ కోసం వచ్చి దొరికిపోయాడు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ ఎనుమాముల ప్రాంతానికి చెందిన పస్తం సతీశ్ మనీ లెండింగ్ వ్యాపారం లైసెన్స్ రెన్యువల్ కోసం వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం దరఖాస్తు చేసుకున్నాడు. అర్జీతోపాటు 2023లో తీసుకున్న మనీ లెండింగ్ లైసెన్స్ ప్రొసీడింగ్ కాపీని జత చేశాడు. వీటిని తహసీల్దార్ ఇక్బాల్ పరిశీలించగా అసలు బాగోతం బయటపడింది. దరఖాస్తు వెంట జత చేసిన ప్రొసీడింగ్స్ తహసీల్ నుంచి జారీ కాలేదని, తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేశారని, అలాగే డాక్యుమెంట్ల మీద ఉన్న రౌండ్ సీలు, స్టాంప్‌లతో కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని గుర్తించారు. నకిలీ డాక్యుమెంట్లను సమర్పించిన సదరు వ్యక్తిపై తహసీల్దార్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ గోపి తెలిపారు.



నర్సింహులపేట : వాడిపోతున్న పత్తి చేను

తొర్రూరు : మాటేడులో ఎండిపోతున్న వరి పైరు



పెద్దవంగర : ఎండిపోతున్న పంటను చూపుతున్న పోచంపల్లి రైతులు



**గంటకు రెండు లీటర్ల డీజిల్ ఖర్చు**

నాకు ఉన్న రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్న. చెరువుపైనే ఆధారపడి సాగు చేస్తే నీళ్ల లేక పొలం ఎండుతున్నది. ఈ మధ్య పడ్డ వానలకు రోడ్డు పక్కన గుంతల్లో నీళ్లు నిలిచాయి. వీటిని పొలానికి పారిచ్చేందుకు ట్రాక్టర్‌కు మోటరు పెట్టి గంటకు రెండు లీటర్ల డీజిల్ పోస్తూ పైపులు వేసి నీళ్లను వాడుకుంటున్న. ఇప్పటికైనా కాల్వల ద్వారా నీళ్లు వదిలి చెరువు నింపితే మాలాంటి రైతులం పొలాలను కాపాడుకుంటం.

– వల్లపు హరీశ్, రైతు, మాటేడు

**ఎప్పుడూ లేని విధంగా ఈసారి రైతన్నకు గడ్డు పరిస్థితి ఎదురైంది. ఈ సీజన్‌లో ఆశించిన వానల్లేక చెరువుల్లోకి నీరు రాక కండ్లముందే పంటలు ఎండిపోతుండడం చూసి అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పదేళ్లలో ఏ ఊరిలో చూసినా జలకళ సంతరించుకొని చెరువులు, చెక్‌డ్యాంలు మత్తడి దూకుతూ పంట పొలాలకు పరుగులు తీసేవి. ప్రస్తుతం సాగునీరు లేక, ఉన్న కొద్ది నీటిని పారిద్దామన్నా సక్రమంగా కరెంటు ఉండక పొలాలు నెర్రెలుబారుతున్నాయి. ఎప్పుడూ నిండుగా ఉండే చెరువులు ఈ సారి ఎండిపోయి వెలవెలబోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు కుంటలు, రోడ్డు పక్కన గుంతల్లోని నీటి కోసం తంటాలు పడాల్సి వస్తోంది.**

*– తొర్రూరు/నర్సింహులపేట/పెద్దవంగర, ఆగస్టు 29*

# నీళ్లు లేక ఎవుసం సాగక..

**నెర్రెలు బారుతున్న పంట పొలాలు**

- కరెంట్ సక్రమంగా రాక ఇబ్బందులు
- పలుచోట్ల చెరువు తూములు ఎత్తక నీటి కోసం నిరీక్షణ
- గుంతల్లో నిలిచి ఉన్న నీటిని వాడుకునేందుకు విఫలయత్నం
- దిక్కుతోచక ఆగమవుతున్న అన్నదాతలు

**ఆశించిన వానల్లేక నిండని చెరువులు**

'మూలిగేనక్కపై తాటిపండు పడ్డ చందం'గా అన్నదాతలకు కాలం విషమ పరీక్ష పెడుతున్నది. ఓ వైపు రుణమాఫీ కాకున్నా, రైతుభరోసా అందకున్నా అప్పోసప్పో చేసి పంటలు సాగు చేసిన రైతులకు వరుణ దేవుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. సకాలంలో వానలు పడక కర్షకులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నర్సింహులపేట మండలంలో ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కరకట్ట తెగిపోవడంతో వాగులో నీరు నిలిచే అవకాశం లేక, ఉన్న నీటిని పంటలకు పారించేందుకు కరెంట్ సక్రమంగా ఉండకపోవడంతో వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. పత్తి పంటలు వాడిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నర్సింహులపేట మండలంలోని ఉమ్మడి జయపురం శివారు బాసుతండా, బక్క తండా గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు సాగు చేసిన వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. బోర్లు, బావుల ద్వారా నీళ్లు పారించుకుందామంటే కరెంట్ సక్రమంగా రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, అందులో సగం కూడా రావడం లేదంటున్నారు. పావుగంట కరెంటు ఇస్తే అరగంట పాటు పోతున్నదని ఆందోళన చెందుతున్నారు. జయపురం శివారు ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కరకట్ట తెగిపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్టే కిందికి పోతున్నదని చెబుతున్నారు. ఇక పెద్ద వంగర మండలంలోని శ్రీరాంసాగర్ కాల్వ పరీవాహక ప్రాంతాల్లో వందల ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి.

ఉప్పరగూడెం, పోచంపల్లి, పెద్దవంగర, గంట్లకుంట, కొరిపల్లి గ్రామాల్లో వరి, పత్తి, మక్కజొన్న పంట పొలాలు సాగునీరు లేక నెర్రెలు బారుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీరాంసాగర్ ద్వారా సాగునీరందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**నిండని చెరువులు..**

తొర్రూరు డివిజన్‌లోనే అతిపెద్ద చెరువుగా ఉన్న మాటేడు గణపసముద్రంలో నీరు లేక ఎండిపోయే దశకు చేరుకుంది. ఎనిమిదేళ్లుగా ఈ చెరువు ఈ సమయంలో వర్షాలు, గోదావరి జలాలతో నిండడం వల్ల సుమారు 800 ఎకరాలకు పైబడి ఆయకట్టు సాగులో ఉండేది. ఈ సంవత్సరం ఆశించిన వర్షాలు కురవక, కాళేశ్వరం జలాలు రాక చెరువు కింద వరి సాగుచేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు నిండలేదని సాగు విస్తీర్ణం తగ్గించుకున్నప్పటికీ వేసిన పంటకు నీరు లేక ఎండిపోతున్నది. వాస్తవానికి చెరువులో జలమట్టం ఆధారంగా పొలాలకు సాగునీటి కోసం క్రమపద్ధతిలో తూముల ద్వారా నీటి విడుదల చేసేవారు. ఆడపాదడపా కురుస్తున్న వానలకు రోడ్డు పక్కన గుంతల్లో నిలిచిన నీటినైనా వాడుకోవాలని గంటకు రెండు వందల రూపాయలు ఖర్చు పెట్టి ట్రాక్టర్లకు మోటర్లు బిగించి పొలానికి పారించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.



పెద్దవంగర : పోచంపల్లి గ్రామ శివారులోని నీరు లేక ఎండుతున్న శ్రీరాంసాగర్ కాలువ

**ఎండుతున్న వరి పైర్లు**

మాటేడు పెద్ద చెరువు కింద సాగవుతున్న వరి పైర్లు ఎండిపోతున్నాయి. వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న వరి పైర్ల తీరును గురువారం పరిశీలిస్తే లేగల అమృతారెడ్డి మూడు ఎకరాలు, బూర్గుల రామచంద్రయ్య నాలుగు ఎకరాలు, జె.సుబ్బారావు ఎకరం 20 గుంటలు, వల్లపు హరీశ్, నర్సయ్య, వెంకన్న, బూర్గుల మదార్, తాళ్ల మల్లయ్యగౌడ్‌లు రెండేసి ఎకరాల చొప్పున, తాళ్ల ఉప్పలయ్య ఎకరం భూమిలో వరి సాగు చేస్తున్నారు. చెరువు నీటిపైనే ఆధారపడి సాగు చేస్తున్న ఈ పొలాలకు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. వర్షాలు ఆడపాదడపా కురుస్తున్నా, వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎండల తీవ్రత కూడా ఉండడంతో నేల నెర్రెలుబారి నీటి కోసం చూస్తున్నది. రుణమాఫీ సక్రమంగా కాక, రైతు బంధురాక, సాగునీరు లేక అన్నదాత అల్లాడుతున్నాడు.

**కళ్ల ముందే పంట ఎండుతాంది**



చెరువు నీళ్ల పారకంతో వానకాలం, యాసంగి సాగు చేసేటోళ్లం. ఎనిమిదేళ్లుగా రెండు పంటలకు కడుపునిండా నీళ్లు వచ్చినయి. ఈ ఏడు కాల్వల్లో నీళ్లు రాక, వానలు సక్కగ పడక మా ఊరు చెరువు ఎండిపోతున్నది. కళ్ల ముందు పొలం ఎండుతుంటే దుఃఖం వస్తాంది. సర్కార్ వెంటనే నీళ్లు పంపి మా చెరువు నింపి పంటలు కాపాడాలి.

– టీ సుబ్బారావు, రైతు, మాటేడు

**పారిన మడే మళ్లీ పారుతాంది**



నర్సింహులపేట : రెండు వారాల సంది కరెంట్ తిప్పల పెడుతాంది. పొద్దున వచ్చిన కరెంట్ రోజులో 10, 15 సార్లు పోతాంది. కరెంట్ పొయ్యి వచ్చేసరికి గంటల సమయం పడుతాంది. దీంతో పారిన పొలం మడే మళ్లా పారుతాంది. కరెంటోళ్లు ఇటు మొఖాన రావడం లేదు. మా రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు.

– బానోత్ సీతారాం, బాసుతండా

**రైతులకు అన్నీ కష్టాలే..**



పెద్దవంగర : కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్లుగా ఎస్సారెస్పీ నీళ్లు వచ్చేవి. వాటితోనే నాకున్న నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేసుకునేది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వచ్చింది. వీళ్లు కూడా అప్పటిలెక్కనే సాగునీరు ఇస్తరని అనుకొని లక్షలు ఖర్చు చేసి వరి వేసిన. నారుపోసిన కొద్ది రోజులకే సాగునీరు అందకపోవడంతో పెట్టుబడి రాక పంటలు ఎండుతున్నయ్. ఇప్పటికైనా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి రైతులను ఆదుకునేలా శ్రీరాంసాగర్ ద్వారా సాగునీరు అందించేలా చూడాలని కోరుతున్నా. కేసీఆర్ సర్కారు పెట్టుబడి సాయం, రుణమాఫీ మంచిగ ఇచ్చింది. కానీ ఇప్పుడు రైతులకు అన్నీ కష్టాలే.

– మైలపాక యాకయ్య, రైతు, పోచంపల్లి

# ముగిసిన గిర్దావర్ వృక్ష ప్రస్థానం

నేలకూలిన 150 ఏళ్ల నాటి వేపచెట్టు



**కామారెడ్డిగూడెంలో గిర్ధావర్ చెట్టుగా చెప్పకునే 150 ఏళ్ల నాటి వేప చెట్టు గురువారం నేలకూలింది. నైజాం జమానాలో ఈ చెట్టు కింద కూర్చొని రెవెన్యూ కార్యకలాపాలు చేసేవారని గ్రామస్తులు చెబుతారు. రైతులు తమ భూముల వివరాలు సేకరించడం, శిస్తు వసూళ్లను పట్వారీలు ఈ చెట్టు కిందే చేసేవారని అంటారు. కాలక్రమేణా ఈ చెట్టు గిర్ధావర్ చెట్టుగా రూపాంతరం చెందగా, గ్రామస్తులు తమ పంచాయతీలను ఈ చెట్టు కిందే పెట్టుకునేవారు. ఇంతటి పేరున్న ఈ చెట్టు అనుకోకుండా గురువారం మధ్యాహ్నం ఇలా పడిపోయింది. దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఈ మహావృక్షం ప్రస్థానం ముగియడంతో ప్రజలు ఒకింత మదనపడుతున్నారు.**

*– దేవరుప్పల, ఆగస్టు 29*



ఎండిపోయిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

# ఎంజీఎంలో ఎండిన చెట్ల తొలగింపు

**'నమస్తే' కథనానికి స్పందన**

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 29: ఎంజీఎం క్యాజువాలిటీ (అత్యసవర విభాగం) ఎదుట ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న భారీ చెట్లను ఎట్టకేలకు గురువారం అధికారులు తొలగించారు. 'ఎంజీఎం.. నిండా నిర్లక్ష్యం.. ఎండిన చెట్లతో భయం భయం..' శీర్షికన ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చెట్లను కట్ చేయించి రోగులు, అటెండెంట్ల భద్రత కోసం చర్యలు చేపట్టారు. భయంగొలిపేలా ఉన్న చెట్లను ఎలాంటి ప్రమాదం జరగకముందే తొలగించడంతో రోగులు, అటెండెంట్లు, ఎంజీఎం సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

# ఎంజేపీ గెస్ట్ ఫ్యాకల్టీల ఎంపికలో అవకతవకలు

- సీనియర్లను పక్కన పెట్టి కొత్తవారికి అవకాశం
- ప్రిన్సిపాల్స్, ఆర్సీవో కుమ్మక్కు.. అర్హత లేని ఫ్యాకల్టీల ఎంపిక

కమలాపూర్, ఆగస్టు 29 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజేపీ గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీల ఎంపికలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. సీనియర్ గెస్ట్ ఫ్యాకల్టీలను డెమో పేరుతో పక్కకు పెట్టి, అనుభవం లేనివారికే అవకాశం కల్పించినట్లు విమర్శలున్నాయి. రెగ్యులర్ ఫ్యాకల్టీలు లేని సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీలను గురుకులాల్లో కొంత కాలంగా కొనసాగిస్తున్నారు. ఏటా డెమో నిర్వహించి వారిని సెలెక్ట్ చేస్తారు. ఈ సారి కూడా గురుకులాల కార్యదర్శి పాత వారినే కంటిన్యూ చేయాలని ఆదేశాలు జారీ చేసినా అవేమి పట్టించుకోకుండా ప్రిన్సిపాళ్లు చెప్పిన వారినే ఆర్సీవో ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పదేండ్లుగా ఎంజేపీ గురుకుల విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తించి, అన్ని అర్హతలున్నా తమను పక్కన పెట్టారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డెమోలో ఆయా సబ్జెక్టుల్లో ప్రతిభ కనబర్చినా కూడా అనర్హత ఉన్నవారిని మెరిట్ లిస్ట్‌లో పెట్టారని ఆరోపించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు రెండు వందల మంది సీనియర్ గెస్ట్‌ఫ్యాకల్టీలు రోడ్డునపడ్డారు. పీజీ, బీఈడీ, టెట్ అర్హత లేకున్నా గెస్ట్ ఫ్యాకల్టీలుగా పలువురిని ఎంపిక చేశారనే ఆరోపణలున్నాయి. ఏండ్ల తరబడి గురుకుల విద్యాలయాల్లో గెస్ట్‌ఫ్యాకల్టీలుగా కొనసాగుతూ ఆయా సబ్జెక్టులపై నిష్ణాతులైన తమను అకడమిక్ ఇయర్ మధ్యలో తొలగించారని, ప్రిన్సిపాళ్లు, ఆర్సీవో కుమ్మక్కై అనర్హులను ఎంపిక చేయడమేమిటని సీనియర్ గెస్ట్ ఫ్యాకల్టీలు ప్రశ్నిస్తున్నారు. డెమో ఇచ్చిన మార్కుల లిస్టు చూపించాలని ఆర్సీవోను అడిగితే ఇవ్వడం లేదని ఆరోపించారు. కావాలనే సీనియర్ గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గణితం సబ్జెక్టులో 47 మంది గెస్ట్ ఫ్యాకల్టీలకు 32 మంది మహిళలను ఎంపిక చేయగా, 15 మందిని మాత్రమే పురుషులను ఎంపిక చేసినట్లు తెలిసింది. బాలికల గురుకులాలతోపాటు బాలుర గురుకులాలకు సైతం మహిళా గెస్ట్ ఫ్యాకల్టీనే ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీల ఎంపికలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని సీనియర్ గెస్ట్ ఫ్యాకల్టీలు గురుకులాల కార్యదర్శిని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్సీవో (రీజినల్ కోఆర్డినేటర్) మనోహార్‌రెడ్డిని వివరణ కోరగా డెమో ప్రకారమే సెలెక్ట్ చేసినట్లు తెలిపారు.



బయ్యారంలో డీఎంహెచ్‌వోతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

# మందుల్లేవ్.. పరీక్షల్లేవ్

- ప్రైవేట్‌కు పోక చావమంటారా..
- సర్కారు దవాఖాన తీరుపై డీఎంహెచ్‌వోను నిలదీసిన గ్రామస్తులు

బయ్యారం, ఆగస్టు 29: సర్కారు దవాఖానల మందుల్లేవ్.. పరీక్షల్లేవ్.. ప్రైవేటుకు పోక ఏం చేయమంటరు? చావమంటరా? అంటూ మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి మురళీధర్‌ను గ్రామస్తులు ప్రశ్నించారు. బయ్యారం మండల కేంద్రంలోని శ్రీరామ, ప్రశాంతి క్లినిక్‌లు, ల్యాబ్‌లను గురువారం ఆయన తనిఖీ చేశారు. సరైన అనుమతులు లేవని, పరిమితికి మించి వైద్యం చేస్తున్నారని వాటిని మూసివేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ క్రమంలో విష జ్వరాలతో వైద్యం చేయించుకునేందుకు అక్కడకు వచ్చిన ప్రజలు వైద్య శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బయ్యారం, గంధంపల్లి వైద్యశాలల్లో ల్యాబ్ టెక్నీషియన్లు లేరని, పరీక్షల కోసం రక్త నమూనాలు ఇస్తే రిపోర్ట్ వచ్చేందుకు వారం రోజులు పడుతున్నదని, దీంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తున్నదని అన్నారు. పల్లె దవాఖానల్లో సైతం సరైన మందులు, సిబ్బంది లేకపోవడంతోనే మండల కేంద్రాల్లోని ఆస్పత్రులకు వస్తున్నామన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సేవలు మెరుగుపరిచి ప్రైవేటుకు పోకుండా కట్టడి చేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట సిబ్బంది శ్రీనివాస్, రామారావు తదితరులున్నారు.